క్లుప్తంగా

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శింగయ్య

అద్దంకి: బాల్య వివాహాలు చేసిన తల్లిదండ్రులకు.. చేసుకున్న వ్యక్తిని, బంధువులు, పెద్దలపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటారని ఎంపీడీఓ శింగయ్య హెచ్చరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన సోమవారం కమిటీ సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాలపై కిశోర బాలికలు.. తల్లిదండ్రులకు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని కోరారు. బాల్య వివాహాలు చేయడం వలన ఎన్నో అనర్థాలు కలుగుతాయని చెప్పారు. సెక్రటరీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం: మండల సర్వసభ్య సమావేశం 22వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏ. శ్రీనివాసమూర్తి తెలిపారు. సమావేశానికి సంబంధిత ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు అంతా హాజరు కావాలని, మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు. మండల పరిధిలోని అన్ని శాఖలకు సంబంధించిన అంశాలపై ఎంపీపీ సమీక్ష నిర్వహిస్తారని వివరించారు.

ఉచితంగా పండ్ల తోటల పెంపకం

సంతమాగులూరు(అద్దంకి): ఐదెకరాల్లోపు పొలం ఉన్న రైతులకు ఉచితంగా పండ్ల తోటలను పెంచి ఇవ్వనున్నట్లు ఏపీఓ సోమవారం తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవాలయ పునఃనిర్మాణానికి ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న భక్తులు

చీరాల అర్బన్: స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని శ్రీ వీరరాఘవస్వామి దేవాలయం పునఃనిర్మాణం, రాజగోపురం, ధ్వజస్తంభానికి రూ.1.80 కోట్లతో ఏర్పాటుకు భక్తులు ఆమోదం తెలిపారని దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. సోమవారం చీరాల వచ్చిన ఆయన దేవాలయంలో భక్తులతో సమావేశం నిర్వహించారు. దేవస్థానం పునఃనిర్మాణం, రాజగోపురం, ధ్వజస్తంభం, పనులుపై దేవాదాయ శాఖ స్థపతి, ఇంజినీరింగ్ శాఖ ప్లాను, నిర్మాణ వ్యయాలపై చర్చించారు. పూర్తి స్థాయి పునఃనిర్మాణం పనులు గురించి, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి గురించి తెలియచేయగా భక్తులందరూ ఏకగ్రీవంగా పునఃనిర్మాణానికి తీర్మానించారన్నారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి సూర్యప్రకాష్‌రావు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, చీరాల కార్యనిర్వహణాధికారి విసి కృపారావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చీరాలలో స్వల్ప అగ్ని ప్రమాదం

చీరాల అర్బన్: పట్టణంలోని దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు సమీపంలోని వీధిలో పడవేసిన చెత్త సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని దట్టమైన పొగ వచ్చింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటను అదుపు చేశారు. రోడ్డు పక్కన చెత్తలో సిగరెట్ ఆపి వేయకుండా పడవేయడంతో మంటలు వ్యాపించాయి.

ఎన్నికకు తరలిరండి



మాట్లాడుతున్న షేక్ మస్తాన్

అద్దంకి: నూతన ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘ ఎన్నికకు విశ్రాంత ఉద్యోగులందరూ తరలి రావాలని ఉద్యోగ సంఘ నాయకుడు షేక్ మస్తాన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అద్దంకి యూనిట్ సమావేశం సోమవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగింది. షేక్ మస్తాన్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు అద్దంకి లోని గీతా మందిరంలో నూతన కార్యవర్గం ఏర్పాటుకు సంబంధించి ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. షేక్ మస్తాన్, టి. కష్ణయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, మారం కోటేశ్వరరావు, తేలుకుట్ల మురళీధర రావు, సి. హెచ్. అంజలీదేవి, బి. అంజయ్య, కె. సత్యనారాయణ, షేక్ గంజి సైదా తదితరులు పాల్గొన్నారు



బల్లికురవలో అలంకార ప్రాయంగా రక్షిత పథకం



కొప్పరపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో మూలన పడిన బోరు



చెన్నుపల్లిలో వృథాగా..

గ్రామాల్లో దాహం..దాహం

- పని చేయని బోర్లు
- 9 గ్రామాల్లో ప్రజలకు అందని సురక్షిత నీరు
- సీపీ డబ్ల్యూ స్కీంలకు పర్యవేక్షణ లేక లీకేజీలు
- పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్లు



చిన అంబడిపూడి శివాలయం వద్ద సంపు నుంచి వృథా అవుతున్న రక్షిత నీరు

బల్లికురవ: కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాలు అలంకార ప్రాయంగా మారాయి. నాలుగు నుంచి ఆరు గ్రామాలకు ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన సీపీ డబ్ల్యూ స్కీంలకు లీకులు కావడంతో నీరు చివరి గ్రామాలకు చేరటం లేదు. ఫలితంగా ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు. పథకాలకు సమీపంలోని కోల్డ్ స్టోరేజ్‌లో నీరున్నా సాంకేతిక లోపాలతో పని చేయడం లేదు. దీంతో పేదలు గ్రామాల్లో లభించే బోరు నీటినే తాగుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

9 గ్రామాల్లో..

చెన్నుపల్లి, కొండాయపాలెం, సోమవరప్పాడు, కొప్పరపాలెం, వల్లాపల్లి, వేమవరం, కె. రాజుపాలెం, మల్లాయపాలెం, బల్లికురవ గ్రామాల్లోని ట్యాంకులు దిష్టిబొమ్మలుగా ఉండటం తప్ప ప్రజలకు చుక్క నీరందడం లేదు. బోర్లు అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. ముక్తేశ్వరం గ్రామంలో ఎంతో చరిత్ర కలిగిన మహల్ బావి నుంచి నీటిని మోటారు పైప్‌లైన్ కుళాయిల ద్వారా ప్రజలకు నీరు అందిస్తున్నారు. మోటారు మొరాయించటం, పైపు లైన్‌లో సాంకేతిక లోపాలతో ఇక్కడ ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. బల్లికురవలో పోలీస్‌స్టేషన్ పక్కనే ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. గ్రామం, ఎస్సీ, ఎస్టీ, కాలనీలకు ఇంటింటికీ కుళాయిలతో నీటి సరఫరా జరగాల్సి ఉంది. ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు ఎక్కనందున పైపులైన్, కుళాయిల ఏర్పాటు పనులు ముందుకు సాగటంలేదు.

సీపీ డబ్ల్యూ స్కీం అంతంత మాత్రమే..

జిల్లా పరిషత్ ద్వారా ప్రభుత్వ అజమాయిషీలో ఉండే అంబడిపూడి, కొణిదెన, వైదన, కూకట్లపల్లి రక్షిత పథకాలు అంతంత మాత్రంగానే పని చేస్తున్నాయి. అంబడిపూడి పథకం నుంచి ఆరు గ్రామాలకు నీరందించాల్సి ఉంది. చిన అంబడిపూడి శివాలయం సమీపంలో నీటి తొట్టివద్ద పైపు లైన్‌కు లీకేజీతో నీరు వృథా అవుతోంది. దిగువ గ్రామాలకు చేరటం లేదు. కొణిదెన పథకం నుంచి గంగపాలెం, మల్లాయపాలెంకు నీరు చేరటంలేదు. సోమవరప్పాడులో పథకం ఏర్పాటు చేశారు. స్టోరేజ్ చెరువు లేదు. చెన్నుపల్లి చెరువులో నీరున్నా పథకం సాంకేతిక లోపాలతో పని చేయడం లేదు.

పుట్టగొడుగుల్లా మినరల్ ప్లాంట్లు

రక్షిత పథకాలు సక్రమంగా పని చేయకపోవడంతో పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్లు వెలిశాయి. గిరాకీని బట్టి 20 లీటర్లు రూ. 10 నుంచి రూ. 20 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే నీటిలో నాణ్యతలేదని కనీసం మినరల్ వాటర్ ప్లాంట్లను అధికారులు పర్యవేక్షించం కూడా లేదని ప్రజలు వాపోతున్నారు. అనుమతులు ఉన్న ప్లాంట్లను గ్రామాల వారీగా వేళ్ల మీద లెక్కించవచ్చు. ఈ విషయాలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరినాయక్‌ను వివరణ కోరగా 4 నెలలుగా మూలన పడిన సురక్షిత పథకాలపై ప్రత్యేక ఫోకస్‌తో కొంతమేర మెరుగు పర్చామన్నారు. చెన్నుపల్లి, కొండాయపాలెం, బల్లికురవ, గ్రామాలపై దృష్టి పెట్టి సురక్షిత నీరు అందించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయండి



బల్లికురవకు జలజీవన్ మిషన్ పైపులైన్ ఇంటింటికీ కుళాయిలు మంజూరైనా పనులు అడుగు ముందుకు పడటంలేదు. ఆరు గ్రామాలకు కలిపి అంబడిపూడి వద్ద చేపట్టిన పథకం ద్వారా నీరు సక్రమంగా అందడం లేదు. బల్లికురవలోని ట్యాంకుకు నీరు ఎక్కించి ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలగుతాయి.

బి. అజయ్‌కుమార్, బల్లికురవ

సజ్జాపురం పథకం నుంచి చుక్కనీరు రావటంలేదు



సజ్జాపురం రక్షిత పథకం నుంచి పైపులైన్ ఏర్పాటుతో కొప్పరపాలెం గ్రామంలో మినీ ట్యాంక్‌లు కుళాయిలు ఏర్పాటు చేసి పది సంవత్సరాలైంది. ఏనాడూ చుక్కనీరు వచ్చినా దాఖలాలు లేవు. మా గ్రామానికి స్టోరేజ్ చెరువు, ఫిల్టర్ బెడ్‌లతో పథకాన్ని ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలగుతాయి.

జి. సీతారెడ్డి, కొప్పరపాలెం

చెట్లను పరిరక్షించడం అధికారుల బాధ్యత



పాదుల్లో నీరు పెడుతున్న తహసీల్దార్ చరణ్

అద్దంకి: చెట్లను సంరక్షిస్తే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని తహసీల్దార్ జి. చరణ్ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవ సందర్భంగా మన్నం త్రిమూర్తులు సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణల్లోని 40 చెట్లకు పాదులు తీయించి ట్యాంకర్లతో నీరు పెట్టారు. ప్రభుత్వ కార్యాలయంలో చెట్లను సంరక్షించుకోవడం అధికారులు బాధ్యతన్నారు. త్రిమూర్తులు మాట్లాడుతూ పుడమి తల్లిని ఇబ్బంది పెట్టే విధంగా ఉన్న ప్లాస్టిక్ నిషేధం పూర్తిగా అమలు జరగాలన్నారు. ప్రెసిడెంట్ చప్పిడి వీరయ్య, మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీ సధాకర్‌రావు, ఏఎస్ఓ అమర్‌నాథ్, జ్యోలా చంద్రమౌళి, తాళ్లూరి బాబూరావు పాల్గొన్నారు.

చిన్నారులు అన్ని రంగాల్లో రాణించాలి



కుంకలమర్రులో బహుమతులు అందిస్తున్న హెచ్ఎం బాబూరావు

కుంకలమర్రు (కారంచేడు): విద్యార్థులు చిన్నతనం నుంచే వారిలోని ప్రతిభకు పదును పెట్టాలని, అప్పుడే భవిష్యత్తులో అనుకన్న విజయాన్ని సొంతం చేసుకోగలుగుతారని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. సోమవారం కుంకలమర్రు చర్చి కాంపౌండ్ (సీసీ) ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. చదువుతో పాటు పలు సాంస్కృతి కార్యక్రమాలు, ఆటలు, పాటలు, చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచనలు వంటి అన్ని రంగాల్లో రాణిస్తూ ప్రతిభను మరింత పెంచుకోవాలని సూచించారు. కుంకలమర్రు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, హైస్కూల్ హెచ్ఎం పద్మావతి, మెయిన్ స్కూల్ హెచ్ఎం పావులూరి శ్రీనివాసరావు, సీసీ హెచ్ఎం శ్యామల, గాంధీనగర్ హెచ్ఎం రాజేశ్వరి, పీ నాగమణి, వి. బాబూరావు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ తండ్రికి నివాళి



చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నరసింహా రెడ్డి, శ్రీనివాసరెడ్డి

మేదరమెట్ల: మాజీ ఎంపీపీ అన్నెం అంజిరెడ్డి తండ్రి అన్నెం జోగిరెడ్డి పెద్ద కర్మకు వైఎస్సార్‌సీపీ నాయకుడు పానెం నరసింహా రెడ్డి, శ్రీనివాసరెడ్డి సోమవారం హాజరై నివాళి అర్పించారు. బొడ్డువానిపాలెంలోని అంజిరెడ్డి గృహానికి వెళ్లి జోగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల నాయకులు, స్థానికనాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీ బిడ్డల ఆరోగ్యం



కారంచేడులో అవగాహన కల్పిస్తున్న హిమబిందు

కారంచేడు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లితో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ కారంచేడు సెక్టార్ సూపర్‌వైజర్ హిమబిందు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కారంచేడు 8 అంగన్‌వాడీ సంఖ్యలో పౌష్టికాహారంపై సంపూర్ణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ఆ సెంటర్ పరిధిలోని గర్భిణులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పౌష్టికాహారం కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. శివలీల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలంతా బడిలో ఉండాలి

అద్దంకి: బడిఈడు పిల్లంతా బడిలోనే ఉండాలని తిమ్మాయపాలెం ఎస్సీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి అన్నారు. సోమవారం కాలనీలో పర్యటించి ప్రభుత్వం నుంచి అందుతున్న వసతుల గురించి వివరించారు. ఈ సంవత్సరం మీ పిల్లలను బడిలో చేర్పించి వారి ప్రగతిని సంవత్సరం తరువాత పరిశీలించకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు(అద్దంకి): సంతమాగులూరు మండలంలో సోమవారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అందులో 10లక్షలతో ప్రారంభించిన వాటర్ ప్లాంట్, రూ.30లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, ప్రభుత్వ పాఠశాలలో రూ.78.17లక్షలతో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



పర్చూరులో గ్రాడ్యుయేషన్‌డే నిర్వహిస్తున్న కార్యకర్తలు

పర్చూరు(చినగంజాం): పర్చూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నెహ్రూ నగర్ 13 వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. 5 సంవత్సరాలు నిండిన 6 ఏళ్లలోకి వచ్చిన పిల్లలను వారి తల్లిదండ్రుల అనుమతితో స్థానిక నెహ్రూ కాలనీలోని ఎంపీ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. హెచ్ఎం జయలక్ష్మి, సూపర్‌వైజర్ పి. దీపాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంకొల్లు తరలిన నాయకులు



యద్దనపూడి నుంచి ఇంకొల్లుకు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యద్దనపూడి: రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ పర్చూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఇచ్చిన పిలుపు మేరకు యద్దనపూడి మండలం నుంచి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఇంకొల్లు తరలివెళ్లారు. పార్టీ మండల కన్వీనర్ రావూరి వేణుబాబు ఆధ్వర్యంలో సుమారు 200 కు పైగా ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా యద్దనపూడి నుంచి వెళ్లారు. అనంతరం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్రగా వెళ్లి ఇంకొల్లు తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. మాజీ పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి, మాజీ జిల్లా కమిటీ సభ్యుడు మువ్వల రాంబాబు, నల్లపునేని లక్ష్మయ్య, నక్కా పోతిరెడ్డి, చెంచుబాబు, గంగిరెడ్డి కృష్ణారెడ్డి, దొడ్డా రవి, తూబాటి బాలకృష్ణ, అంబటి శ్రీను, సవరపు వందనం, పెద్దబాబు, రాయి రాంబాబు, గనిపిశెట్టి వెంకట్రావు, యన్నం శ్రీను, శ్రీకాంత్, తనుబొద్ది వీరారెడ్డి, బసివిరెడ్డి, కాజియ్య, షేక్ బుడే, నాగూర్‌బాషా, కవల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ప్రవేశ దరఖాస్తులు అందిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకాన్ని పెంచి, విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పాఠశాలలో ప్రవేశాల కోసం వివిధ పాఠశాలలను సందర్శించి ప్రవేశ దరఖాస్తులు అందించారు. ఉచిత పుస్తకాలు, యూనిఫాం, నాణ్యమైన విద్య, డిజిటల్ క్లాస్ రూంలు, ప్యూరిఫైడ్ వాటర్, స్పోర్ట్స్ వంటి సదుపాయాలను వివరిస్తూ ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు.

పాత చట్టాలను కొనసాగించాలి



బల్లికురవలో ముస్లింల శాంతియుత నిరసన ర్యాలీ

బల్లికురవ: వక్ఫ్ సవరణ చట్టం 2025కు తాము వ్యతిరేకిస్తున్నామని ముస్లిం జేఏసీ డిమాండ్ చేశారు. సోమవారం బల్లికురవలో శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పురవీధుల్లో నాలుగు రోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్లకార్డులతో ఇంకిలాబ్ జిందాబాద్, పోరాడదాం, సాధిద్దాం, అంటూ కొత్త సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని నినాదాలు చేశారు. భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని, మత సామరస్యాన్ని కాపాడాలని కులాలు మతాల మధ్య చిచ్చు పెట్టే విధానానికి చెక్ పెట్టాలన్నారు.

145 మంది హాజరు

చీరాల అర్బన్: చీరాలలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశం కోసం సోమవారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు 145 మంది హాజరయ్యారు. పరీక్షలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డి.ప్రసాదరావు పరిశీలించారు.



ఇంకొల్లు స్థూపం సెంటర్ వద్ద రైతులు, నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి



తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

పాఠశాల అభివృద్ధి దాతలకు సన్మానం

మార్టూరు: తమ పాఠశాల అభివృద్ధి కోసం అవకాశం ఉన్నప్పుడల్లా చేయూతనిస్తూ సహకరిస్తున్న దాతలను మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సోమవారం ఘనంగా సత్కరించి సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. చలపతి, దాతలైన బబ్బే పల్లి గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు మాలెం పాటి మల్లయ్య, మదన్, విశ్రాంత ఉపాధ్యాయులు కళ్లే పల్లి గోపాలరాజు, తాళ్లూరి సాంబశివరావు లను సన్మానించారు. మద్దుమాల కోటేశ్వరరావు, శేషయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.